

•శరవేగంగా కేటీ రోడ్డు నిర్మాణం

వన్ టౌన్ కేబీఎన్ కాలేజ్ కేటీ రోడ్డు ప్రధాన రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్డు పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగంగా చేయిస్తున్న చిత్రాలివి. సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు
- పార్టీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



భవానీపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులను సత్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



పురస్కార గ్రహీతలతో డాక్టర్ ఎం.ప్రభాకర్, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్



మాట్లాడుతున్న శైలజా శ్యామల రావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. భవానీపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నగర మేయర్ భాగ్యలక్ష్మీ, వెలంపల్లి శ్రీనివాసరావు మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళా కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైఎస్ చైర్మన్లను సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో జగనన్న పని చేస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. మహిళల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ ప్రతి సంక్షేమ పథకం ద్వారా కలిగే లబ్ధిని వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో 31 లక్షల మంది మహిళలకు ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు కడుతున్నారన్నారు.

మహిళలను కించపరిచిన చరిత్ర బాబు, పవన్‌ది....

పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో మహిళలను కించపరుస్తూ మాట్లాడారన్నారు. నేను 3 పెళ్లిళ్లు చేసుకున్నా.. మొదటి ఇద్దరికీ భరణం ఇచ్చాను. కావాలంటే మీరు కూడా చేసుకోండి అని మహిళలను అవహేళన చేశారన్నారు. చంద్రబాబు మహిళలను కించపరుస్తూ మాట్లాడిన మాటలు సిగ్గు చేటన్నారు. కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అంటూ వివక్ష పూరితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మహిళలను కించపరిస్తే నేడు జగనన్న మహిళకు పెద్ద పీట వేసి వారి సాధికారతకు అడుగులు వేస్తున్నారన్నారు. శాసన మండలి ఉపాధ్యక్షురాలిగా, రాష్ట్ర హోం మంత్రిగా మహిళలను నియమించి వారిని గౌరవించారన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మహిళ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి రజని, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సంపత్ విజితా, ఎంపీపీ కోటేరు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రగతిని స్వాగతించాలి

విజయవాడ కల్చరల్: మహిళా ప్రగతిని స్వాగతించాలని ఏపీ అసెంబ్లీ ఓఎస్డీ డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తుమ్మపల్లి కళాక్షేత్రంలో శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన మహిళలకు శింగంశెట్టి మహిళా పురస్కార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా ప్రగతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన హైమావతి, దొడ్డ సుధారాణి, గోళ్ళ విజయశ్రీ గుప్తా, వడ్డాది సూర్యకామేశ్వరి, కొండేటి దుర్గానాగమణి, షబానా, వీరంకి భారతీ దేవిలకు శింగంశెట్టి మహిళా పురస్కారాలను ప్రదానం చేశారు. గాయకులు పలు గీతాలు గానం చేశారు.

దుర్గగుడిలో మహిళా దినోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈవో భ్రమరాంబను చైర్మన్ రాంబాబు సత్కరించారు. పలువురు మహిళా ఉద్యోగులు సైతం ఈవోను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఈఈ ఎల్.రమ, ఏఈవో పి.సుధారాణి, పర్యవేక్షకులు లక్ష్మీ ప్రసన్న, హేమ దుర్గాంబ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, ఉద్యోగులు, ఆలయ సెక్యూరిటీ సూపర్‌వైజర్ సాయి, ఇతర అధికారులు ఉన్నారు.

మహిళా సాధికారత దిశగా సీఎం జగనన్న

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా కృషి చేస్తున్న ఏకైక సీఎం జగనన్న అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి మాట్లాడారు. రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు ఎ నూకాలమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎం.ప్రసాద్, కడియాల సుబ్బారావు, ఎస్.మల్లికార్జున, మహిళా కమిటీ సభ్యులు బి.శారద, జి.అరుణ, బి.నీరజ, ఎస్ భ్రమరాంభ, చైతన్య, రేణుక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి....

మహిళా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వటమే కాకుండా సమానత్వం కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే ఆశయాల సాధన కోసం బాలికలు కృషి చేయాలని ఏపీ రీసెర్చ్ ఆఫీస్ డైరెక్టర్ గంగా ప్రసాద్ అన్నారు. గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ రీసెర్చ్ ఆఫీస్ జాయింట్ డైరెక్టర్ అన్నపూర్ణను సత్కరించారు. రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ పి.రమేష్‌బాబు, పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు, కోశాధికారి డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): గవర్నర్‌పేట-1 డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ ఎం. సునీత ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ కె.బసవయ్య పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో మహోన్నతమైనదని కొనియాడారు. ఆర్టీసీలో మహిళా ఉద్యోగుల విధి నిర్వహణ అనిర్వచనీయమైనదని తెలిపారు. అనంతరం మంచి హాజరు, ఎక్కువ ఆదాయం సాధించిన మహిళా కండక్టర్లు కె.విజయశ్రీ, వి.శ్రీదేవి, ఎం.యశోద, బి.రమాదేవి, ఎమ్.జ్యోతి, సూపర్‌వైజర్లు ఎం.సునీత, ఏ.రాణిలను సత్కరించి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందచేశారు.

మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు ధైర్యంగా ముందుకు అడుగులు వేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం సంచాలకులు డాక్టర్ శైలజశ్యామలరావు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శైలజాశ్యామలరావు 'డిజిటల్ ప్రపంచ సాంకేతికలు - మహిళల పాత్ర - ఆవశ్యకత' అంశంపై మాట్లాడారు. కార్యక్రమాన్ని ఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ రమాదేవి నిర్వహించారు. పాతబస్తీలోని కూరపాటి హైస్కూల్లో మహిళా ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వన్‌టౌన్ ఎస్ఐ వీ రమ్యశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీపీఐ కార్యాలయం లెనిన్ భవనం వద్ద మహిళా సమైక్య జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్ కొరగంజి దుర్గంబ పతాకవిష్కరణ చేశారు.

మహిళల అభ్యున్నతికి తోడ్పడండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళల అభ్యున్నతికి తోడ్పడాలని సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సూచించారు. కృష్ణ - ఎన్టీఆర్ - గుంటూరు జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన కొత్తపల్లి రజని బుధవారం సాయంత్రం గొల్లపూడిలోని రఘురామ్ కార్యాలయానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొత్తపల్లి రజనిని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఎం జగనన్న అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ మహిళల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానని తెలియ చేశారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళతానని చెప్పారు.

రైల్వే మహిళా ఉద్యోగులకు సత్కారం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ జయమోహన్, ముఖ్యఅతిథిగా డీఆర్ఎం షివేంద్రమోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయమోహన్ మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో 1750 మంది మహిళా ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించడం గర్వకారణం చెప్పారు. లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేసి మహిళలకు ఉన్నత స్థాం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్ఎం షివేంద్రమోహన్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో పురుషులతో సమానంతో అత్యుత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 20 మంది మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. సీనియర్ డీపీఓ ఎమ్.బాలమురళీధర్, డీపీఓ షాహబాజ్ హనూర్, సీనియర్ డీఈఎన్ ఆర్‌సీ సహా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈవోను సత్కరిస్తున్న ఆలయ అర్చకులు, వేద పండితులు



కొత్తపల్లి రజనిని అభినందిస్తున్న రఘురామ్



ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు మెమెంటోలు అందచేస్తున్న డిపో మేనేజర్ బసవయ్య



మహిళా ఉద్యోగులతో డీఆర్ఎం షివేంద్రమోహన్, జయమోహన్ తదితరులు



అవార్డులు తీసుకున్న విశ్వబ్రాహ్మణ మహిళలతో శ్రీకాంత్, రామస్వామి తదితరులు

క్లుప్తంగా

హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే, మేయర్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లంబాడీపేటలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయనభాగ్యలక్ష్మి పాల్గొన్నారు. సాయిరాం థియేటర్, జారుబండ రోడ్డు, కేటీ రోడ్డుపై స్థానికులు నిర్వహించిన వేడుకల్లో పాల్గొని రంగోలి నృత్యాలకు ఆడిపాడారు. అనంతరం స్థానికులకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, నగర మేయర్‌లు మిఠాయిలను పంపిణీ చేశారు. 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, రాయన నరేంద్ర, వెన్నం రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వయంబు శ్రీవల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేం చేసిన స్వామి వారి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చన, కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారి కళ్యాణోత్సవం చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాన్ని స్వామి వారి దేవస్థాన సేవా సమితి నిర్వాహకులు టి. నాగరాజు పర్యవేక్షించారు.

రోగులకు పండ్లు పంపిణీ



వించిపేట(విజయవాడపశ్చిమ): నిత్యం సమాజ హితం కోసం శ్రమించే విలేకరులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు చేయూత అందించేందుకు ముందుకు రావటం హర్షణీయం అని షేక్ రాజాసాహెబ్ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వాణిశ్రీ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గంలోని షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రిలోని బాలింతలకు, గర్భిణులకు డాక్టర్ వాణిశ్రీ చేతుల మీదుగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

నేడు వీఎంసీ బడ్జెట్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ 2023-24 వార్షిక బడ్జెట్ అంచనాలపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో 2023-24 ఏడాదికి ఆదాయాలు రూ.1373.26 కోట్లు కాగా అందులో రెవెన్యూ ఆదాయం రూ.859.12 కోట్లు, క్యాపిటల్ ఆదాయం రూ. 444.43 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు రూ.69.71 కోట్లు అంచనాలు పొందుపరచారు. ఖర్చుల్లో రెవెన్యూ ఖర్చు రూ. 697.76 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ. 634.31 కోట్లు, లోన్లు, రీపేమెంట్లు రూ. 18.12 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులు రూ. 69.71 కోట్లు మొత్తం కలిపి రూ.1419.90 కోట్ల అంచనాల బడ్జెట్‌పై వీఎంసీ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు చర్చించనున్నారు.

వీఎంసీ ఆధ్వర్యంలో పింక్ ర్యాలీ

పటమట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వీఎంసీ ఆధ్వర్యంలో పింక్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రాఘవయ్య పార్క్ వరకు సైకిలింగ్ - వాక్ కార్యక్రమాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ కార్పొరేటర్లతో కలిసి పావురాలను ఎగరవేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కమిషనర్ మాట్లాడారు. కార్పొరేటర్లు భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డి, పడిగిపాటి చైతన్య రెడ్డి, మైలవరపు రత్నకుమారి, శర్వాణీ మూర్తి, అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్), కె.వి సత్యవతి, డిప్యూటీ సిటి ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరస్ రాయ్, వీఎంఎస్ డాక్టర్ రవిచంద్, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ టి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకులో....

సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర చాలాప్రత్యేకమైనదని కృష్ణా జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. బందరురోడ్డులోని బ్యాంక్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా సహకార బ్యాంకులో 70 శాతం మహిళలే ఉద్యోగాలు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ సురేష్, బ్యాంకు డైరెక్టర్ పడమట సుజాత, బ్యాంకు జీఎం రంగబాబు, డీజీఎం కాగిత శ్రీనివాస్ , ఏజీఎం వాస్తవి, చీఫ్ మేనేజర్ రాంబాబు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి పంచామృత అభిషేకాలు



పద్మావతి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీలక్ష్మీ కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన పద్మావతి (లక్ష్మీదేవి) అమ్మవారికి బుధవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో గత మూడు రోజులుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 3వ రోజైన బుధవారం లక్ష్మీదేవికి స్వర్ణ, రజిత, ఫలరసాలతో పాటు పంచామృతాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యుల శిష్యబృందం అమ్మవారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు వీక్షించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, పూజల అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగియగా, ఉభయదాతలకు, కార్యక్రమ నిర్వాహకులకు వేద ఆశీర్వచనం జరిగింది. విఖనస సేవా సమాఖ్య ప్రతినిధులు అగ్నిహోత్రం సారంగపాణి, యోగానంద్, గుడిపూడి పార్థసారథి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెంకటేశ్వరస్వామి సన్నిధిలో లక్ష్మీ జయంతి కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో లక్ష్మీజయంతిని పురస్కరించుకొని పలు ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించారు. ఉదయం పద్మావతి అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక తిరుమంజన అభిషేకాలు నిర్వహించారు. వివిధ ఫలపుష్ప, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించి పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని లక్ష్మీఅమ్మవారికి శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు. అర్చక స్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. కొత్తగుళ్ళు ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు.

నాణ్యమైన ఉత్పత్తుల్లో ఎల్‌జీ నంబర్ వన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కస్టమర్లకు నమ్మకమైన ఉత్పత్తులు అందించడంలో ఎల్‌జీ ఎప్పుడూ ప్రపంచంలో నెంబర్ వన్ గా ఉంటుందని సంస్థ హెచ్‌ఏ డైరెక్టర్ యూయంగ్ సబ్‌జి అన్నారు. ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ విజయటాకీస్ ఎల్‌జీ నూతన ఉత్పత్తులను బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీ గత 24 సంవత్సరాలుగా ప్రపంచ మార్కెట్లో గృహోపకరణ రంగంలో ప్రజల యొక్క నమ్మకాన్ని పొందుతూ సరికొత్త ఫ్యూచర్స్ ఎయిర్ కండీషనర్లను మార్కెట్లోకి విడుదల చేయడం సంతోషంగా భావిస్తున్నామన్నారు. మార్కెట్‌లో ఏ ఇతర కంపెనీ ఎయిర్ కండీషనర్‌లలో లభించని అత్యాధునిక ఏఐ+ టెక్నాలజీ ద్వారా మానవుని ప్రమేయం లేకుండానే మన చుట్టూ ఉన్న పరిసరాలకు తగినట్లుగా చల్లదనాన్ని అందిస్తుందన్నారు. కన్వర్టబుల్ 6 ఇన్ 1, యూవీ నానో, ప్లాస్ మాస్టర్ అయనైజర్, థింగ్ వైఫై, విరాట్ మోడ్, పీఎం 1.0 సెన్సార్, డిస్‌ప్లే ఓషన్ బ్లాక్ కోటింగ్, యాంటి వైరస్ ప్రొటెక్షన్, ఆటో క్లీన్, గ్రూవ్ కాపర్, డీసీ సెన్సార్, లో గ్యాస్ డెటెక్షన్ లాంటి అధునాతన సౌకర్యాలను అందిస్తోందన్నారు. తక్కువ విద్యుత్ వినియోగంతో ఇండియాలో ఉత్పత్తి, వినియోగంలో అగ్రగామిగా ఉందన్నారు. ఎల్‌జీ ఏపీ రీజియన్ బిజినెస్ హెడ్ కెవీ కృష్ణాజీ బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్ బాబు, సోనో విజన్ ప్రొప్రయిటర్ భాస్కరమూర్తి పాల్గొన్నారు.



సోనోవిజన్‌లో ఎల్‌జీ నూతన ఉత్పత్తులు విడుదల చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో షబేబరాత్ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మసీదుల్లో షబేబరాత్ పర్వదినాన్ని మంగళవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాగారం చేసి స్థానిక మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వించిపేట, ఇస్లాంపేట, తారాపేట తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు షబేబరాత్‌ను పురస్కరించుకొని పోలీసు శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది.

వన్‌టౌన్‌లో సందడిగా హోలీ వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాతబస్తీలోని అన్ని వీధుల్లో బుధవారం హోలీ వేడుకల సందడి దర్శనమిచ్చింది. ప్రధానంగా వన్‌టౌన్‌లోని కేటీరోడ్డు, బ్రాహ్మణవీధి, సింగరాజువారివీధి, సుబ్బరామయ్యవీధి తదితర ప్రాంతాల్లో యువత ఉత్సాహంగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు రోడ్లపై తిరుగుతూ తమ స్నేహితులపై రంగులు చల్లుతూ హడావుడి చేశారు. ప్రధానంగా ఉత్తరభారతీయ కుటుంబాలే కాకుండా తెలుగువారు సైతం అత్యధికంగా ఈ వేడుకల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. కొత్తపేటలోని పలు అపార్ట్‌మెంట్లలో ప్రత్యేకంగా వాద్యాలతో సందడి చేస్తూ అపార్ట్‌మెంట్ వాసులందరూ పాల్గొన్నారు. వెలగలేటివారివీధిలోని అపార్ట్‌మెంట్స్‌లోనూ అదే తరహా సందడి కొనసాగింది. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు ఇచ్చిపుచ్చుకున్నారు. ప్రధానంగా చిన్నారులు, యువకులు బృందాలుగా తిరుగుతూ రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆర్‌యూబీ పరిశీలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ స్థితిగతులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ బుధవారం పరిశీలించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి మధురానగర్ రైల్వే గేటు వైపు నిర్మాణంలో వున్న ఆర్‌యూబీకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బీటీ సర్వీస్ రోడ్డును పరిశీలించారు. రైల్వే గేటు నుంచి వచ్చే వాహనాలు మరింత సులువుగా ప్రయాణించడానికి వీలుగా రైల్వే గేటు వద్ద గల రైల్వే కేబిన్ లను పక్కకు జరపడానికి రైల్వే శాఖ అధికారులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు.